# కొరకరాని కొయ్య

ఈ కథ చిన్నదే అయినా ఇందులో వచ్చే పాత్రలు మాత్రం ఎక్కువ. ఆ బాధ్యత వెంకటాద్రిగారిది!

వెంకటాద్రిగారు బహు కుటుంబీకులు. ఆ విషయం విడి సమయాల్లో కంటే పండుగలు, పబ్బాలు జరిగినప్పుడు మనకు స్పష్టంగా తెలిసి వస్తుంది. ఆ సమయాల్లో చెన్నపట్నంనుంచి రెండోకొడుకు కృష్ణమూర్తి సతీసుత సమేతంగా స్వగ్రామానికి విజయం చేస్తారు. కాలేజీలో చదువుకుంటున్న మూడోవాడు సుధాకరం వీలైతే ఒకరిద్దరు సహాధ్యాయులతోసహా విచ్చేస్తాడు. ఇక పెద్దకొడుకున్నాడంటే అతడు రాకపోకల కంతగా అందుబాటులో లేని మనిషి. ఒక భార్య, ఆరు మంది బిడ్డలు ఏమంత చిన్న జంజాటంగాదు. నెల కొక్కసారి చెక్కుమార్చుకోడానికి తాలూకా కచ్చేరీకి వెళ్ళే ఒక్కరోజు మినహాయిస్తే రామమూర్తి మిగిలిన యిరవై తొమ్మిది రోజులు యింటిపట్టునే వుంటాడు. చెక్కును గురించిన ప్రసక్తి ఎలాగూ వచ్చింది గనుక అతడి వుద్యోగం గురించి యిక్కడే చెప్పివేయడం సమంజసం. అతడు వూళ్లోనే వున్న ఎలిమెంటరీ స్కూలు హెడ్‌మాస్టరు!

ముగ్గురు కొడుకులు గాక వెంకటాద్రిగారికి కూతుళ్ళు కూడా ముగ్గురున్నారు. అందరూ లక్షణంగా కాపురం చేసుకొంటున్నారు. ఏమాత్రం శుభలేఖ కయినా వాళ్ళు రెక్కలు గట్టుకుని పుట్టింట్లో వాలిపోతారు.

ఇది ప్రస్తావన! ఇక కథారంభం!

ఉగాది పండుగతోబాటు చిరంజీవులకు తలవెంట్రుకలు తీసే తంతొకటి జతచేసే వెంకటాద్రిగారు బంధుమిత్రులకు కార్డుముక్కలు వ్రాసి, పసుపు చుక్కలు పెట్టి వాటిని పోస్టుబాక్సులో వేసి వచ్చాడు. నాలుగు రోజుల్లో యిటు కూతుళ్ళదగ్గరనుంచీ, అటు కృష్ణమూర్తి దగ్గరనుంచీ ప్రత్యుత్తరాలు వచ్చాయి. ఎన్నో పనుల తొందరలో రావడానికి

బొత్తిగా వీల్లేనప్పటికీ రాకతప్పదు, గనుక అందరూ ఒకటి రెండురోజులు ముందుగా రావడానికి అంగీకరించారు. ఒక్క సుధాకరం మాత్రం తమ వుద్యోగంలో చేరి రెండు నెలలు కూడా కాలేదు గనుక సెలవు దొరకదని వ్రాశాడు. అందుకు వెంకటాద్రిగారు విచారించారని చెప్పడానికి వీల్లేదు. మిగిలిన కొడుకులు, అల్లుళ్లలాగే చిన్న కొడుకు గూడా సెలవు దొరక్క యింటికి రావడానికి వీల్లేనంతటి ప్రయోజకుడైనందుకు ఆయనకు సంతోషమే కలిగింది. కానీ వెంకటాద్రిగారిలో వున్న ప్రత్యేకత ఏమంటే ఆయన ఎంతటి సంతోష మైనా దాని కొక విచారపు పైపూత పూసిగానీ వ్యక్తపరచకపోవడం!

"ఇంతకాలమూ వాడొక్కడయినా జాబువ్రాయడమే తడవుగా యింటికి వచ్చేవాడు. ఇక ఆ అశ కూడా లేదు. ఎక్కడి కొడుకులు! ఎక్కిడి తల్లిదండ్రులు! ఋణానుబంధ రూపేణా పశుపత్నీ సుతులు కదండీ!" అని ఆయన తిన్నెపైన వేదాంత గోష్ఠిలో భోజనకాలం మధ్య మధ్య హరినామ స్మరణలా తన సంసారం గొడవ ఏకరవుపెట్టుకునేవాడు.

ఒక్కసారి ప్రసంగం యింటి గొడవలవైపు మళ్ళాలే గానీ యిక దానికి అంతెక్కడ! తీగను పట్టుకుంటే డొంకంతా కదలడానికి సిద్ధంగా వుంటుంది.

"ఊఁ....వాడూ ఒక యింటివాడియితే మన బాధ్యత తీరిపోతుంది." అని అర్థంకాని వేదాంతాన్ని ఆసక్తితో వినడానికి ప్రయత్నించేవారు వెంకటాద్రిగారు.

"చేసేయాల్సిందే! ఎవరికట్టిలేం శాశ్వతం" అంటూ లక్ష్మమ్మ. వెంకటాద్రిగారి పాటకు శ్రుతి కలిపేది.

"జాతకం చూస్తూనే వున్నానుగా! వాడికి వచ్చే వైశాఖ మాసంలో వివాహయోగం పడుతుంది. ఆ లోపల మనం కావాలనుకున్నా జరగదు. అప్పుడు మనం వద్దన్నా ఆగదు."

వెంకటాద్రిగారి నమ్మకం ప్రకారం రాజులు, రాజ్యాలు మారితే మారవచ్చుగానీ జాతక ఫలాలు మాత్రం తప్పిపోవు. ఈ నమ్మకాన్ని గురించి మరింతనొక్కిచెప్పడం అవసరం. ఆయన సిద్ధాంతరీత్యా గ్రహాల్నిబట్టి పంచాంగం నడవదు. పంచాంగాన్నిబట్టి గ్రహాలు ప్రవర్తిస్తాయి.

జాతకాల్ని గుణించి దశాభుక్తి ఫలాలు నిర్ణయించడాన్ని ఒక అసిధారావ్రతంలా వెంకటాద్రిగారు ఒంటబట్టించుకున్నారు. అందులో తనవాడనీ, మనవాడనీ, అయినవాడనీ, కానివాడనీ భేదంలేక తనకు తోచింది తోచినట్టు కాగితంపై కెక్కించేయడానికి ఆయన ఎప్పుడూ తటపటాయించలేదు. ఉదాహరణకు రెండో కొడుకు సంతానయోగాన్ని గురించి ఆయన చేసిన నిర్ణయాన్నే పేర్కొనవచ్చు. తన వాళ్ళకందరికీ వెంకటాద్రిగారు విపులంగా

జాతకాలు వ్రాసి అదొక నిక్షేపంలా పెట్టెలో భద్రపరిచారు. అందులో కృష్ణమూర్తి జాతకం పైకితీసి సంతానయోగంకోసం ప్రత్యేకించబడ్డ కాగితాన్ని గనుక చూచినట్లయితే విధినిర్ణయంలా ఒక వాక్యం కనబడుతుంది. 'ఫలానా ఫలానా గ్రహాలు వక్రించడంవల్ల ఈ జాతకుడు అపుత్రకుడు." కానీ చిత్రమేమిటంటే పెళ్ళయిన ఏడాదికే రెండో కోడలు వెంకటాద్రిగారి పైన పంతంపట్టినట్టు పనసపండులాంటి మగబిడ్డను కని ఆయన ఒడిలో పడుకోబెట్టింది. అప్పుడు వెంకటాద్రిగారు జాతకాన్ని పునఃపరిశీలన చేసి సంతానకారుకుడైన ఫలానా గ్రహాధిపతి జాతకుణ్ణి వక్ర దృష్టితో చూస్తున్నప్పటికీ ఆ గ్రహాధిపతి పైకి కొన్ని శుభగ్రహ వీక్షణాలు ప్రసరిస్తున్నందువల్ల ఈ జాతకుడికి బిడ్డలు కలుగవచ్చునని ఒక సవరణ రూపొందించారు.

మొగమాటం లేకుండా జాతకఫలాలు వెలిబుచ్చడం వల్ల వెంకటాద్రిగారు యిరకాటంలో పడ్డ సంఘటనలు సైతం లేకపోలేదు. ఒకసారి వధూవరుల జాతకాల్ని చూస్తూ ఆయన పొంతనాలు కుదరలేదన్న కారణంతో ఆ వివాహం ఆపేయడం మంచిదని సలహా యిచ్చాడు. వెయ్యి అబద్ధాలు చెప్పి ఒక పెళ్లి చేయడం పోయి, వివాహానికి ప్రతిబంధకంగా తయారైన వెంకటాద్రిగారి పైన యిరుపక్షాల వారికి పట్టరానంత ఆగ్రహం కలిగింది. ఆగ్రహపడ్డంతో మాత్రం వూరుకోక ఆశాభంగం చెందిన పెళ్ళికొడుకు ఒంటరిపాటున వెంకటాద్రిగారిపైన నోరు చేసుకుంటున్నాడని ఆ మధ్య వూళ్ళో పుకారు బయల్దేరింది. అందులో నిజమెంతో, అబద్ధమెంతో మనకు తెలియదు.

ఇంతటితో వెంకటాద్రిగారి జాతకాల గొడవ కట్టిపెట్టి మనం మళ్ళీ కథలోకి వస్తున్నాం!

బిడ్డలకు తలనీలాలు తీసినరాజు రాత్రి భోజనానంతరం బంధువులందరూ ఆరుబయట వెన్నెల్లో కూచున్నారు. అందరికీ మధ్య వెంకటాద్రిగారు తాంబూలంసేవిస్తూ ఈజీచేర్‌పైన కూచున్నారు. మూడో కుమార్తె సావిత్రి బస్సు ప్రయాణంలో ప్రయాణీకుల రద్దీని గురించి చేతులు త్రిప్పుతూ చేస్తున్న ప్రసంగం విని అన్నదమ్ములు గొల్లున నవ్వుతున్నారు. ఒకమూల కుర్రాళ్ళిద్దరు కుస్తీకి దిగారు. ఇంట్లో కృష్ణమూర్తి కొడుకు రెండేళ్ళవాడు పెంకులెరిగిపోయేటట్టు ఏడుస్తున్నాడు.

"అబ్బే! వాడూరుకునే ఘటంకాదే అమ్మా! మదరాసులోనైతే ఏడుస్తున్నప్పుడు వాడిని వీధిలోకి తీసుకెడ్తేపరుగెత్తే బస్సుల్ని రిక్షాల్ని చూచి ఏడుపు మానేసేవాడు" అంటూ తన కుమారుణ్ణి సముదాయించే పద్ధతుల్లో ఒకటి బయట పెట్టాడు కృష్ణమూర్తి.

"ఈ పల్లెటూళ్ళో బస్సులు, రిక్షాలు లేవుగనుక వాడు ఎంతకూ ఏడుపు మానుకోడన్నమాట!" అని పెద్ద తోబుట్టువు పార్వతి తమ్ముడివైపు చూస్తూ ఆశ్చర్యం ప్రకటించింది.

కృష్ణమూర్తి నవ్వి ఊరుకున్నాడు.

"నాన్నగారెంతో మౌనంగా వున్నారు." అని అందరి దృష్టినీ వెంకటాద్రిగారివైపు తిప్పింది. రెండో అమ్మాయి సరస్వతి.

"ఏం లేదు! మనమందరమూ మళ్ళీ కలుసుకోడం ఎప్పుడాఅని" అంటూ వెంకటాద్రిగారు ఒక సమస్యలాంటి విషయాన్ని సభాసదులపైకి వదలి, ఒకలోటా మంచి నీళ్ళు నోట్లో పోసుకుని పుక్కిళించుకుంటూ పైకి లేచారు.

"వచ్చే వైశాఖంలో తమ్ముడిపెళ్ళి జరగాలంటోందే అమ్మ." అంది సావిత్రి.

మళ్ళీ కుర్చీలో కూచుంటూ వెంకటాద్రిగారు "మాటలకేం! అసలు వాడు పెళ్ళి వద్దంటున్నాడు" అన్నారు.

"అలాగనక వాడు పెళ్ళి పెళ్ళి అని నిన్ను బలవతం చేస్తాడా నాన్నా" అంది పార్వతి.

"ఏం పెళ్ళో! వద్దు వద్దంటున్నా వినకుండా ఇరవై యేళ్ళు అయ్యీ కాకముందే నాకు పెళ్ళిచేసేశారు. ఏం సుఖపడ్డాను" అని నిట్టూర్చాడు రామమూర్తి.

"నీకేంరా! మేం చేయడంవల్ల నీకేం నష్టమైంది? చూస్తూ చూస్తుండగానే బిడ్డలు నీచేతికెదిగొస్తారు" అంది లక్ష్మమ్మ.

"ఎదిగొస్తే సరిపోయిందేమిటి! వాళ్ళకు పెళ్ళిళ్ళు పబ్బాలు అవన్నీచేసి తల బట్టగట్టేదెవరికి?" అన్నాడు రామమూర్తి.

"తెలిసి తెలిసీ అజ్ఞానంలో పడతారెందుకు! మనస్సు బట్టక మనమిలా ఆలోచించి సతమతమౌతూ వుంటాంగానీ గ్రహబలం కలిసివస్తే కార్యాలు జరగడమెంతసేపు" అన్నారు వెంకటాద్రిగారు.

"వైశాఖంలో వాడికి వివాహయోగం వుందని మీరే చెప్పారుగా!" అంది లక్ష్మమ్మ యింకా పెళ్ళికేం ఆటంకాలున్నాయని ప్రశ్నించకనే ప్రశ్నిస్తూ.

"అది సరే ననుకోవే అమ్మా! మనం కూడా కొంత ప్రయత్నించాలికదా! భారమంతా ఆ గ్రహాల పైనే వేసి ఊరుకుంటే ఎలాగు" అన్నాడు కృష్ణమూర్తి.

"ప్రయత్నించరాదుట్రా మరి! ప్రయత్నం చేయమని సలహా యివ్వడానికి ఈ ముసలివాళ్ళు దొరికారేమి నీకు" అన్నారు వెంకటాద్రిగారు.

"మేం ప్రయత్నిస్తామనుకో నాన్నా! కానీ తీరా సంబంధం కుదుర్చుకున్న తర్వాత మీకు పొంతనాలు కుదరకపోతే!"

"కుదరకపోతే మరొక సంబంధం చూచుకోవాలి."

"ఈ బాదరబందీ ఎందుకు నాన్నా! జాతకాన్నిబట్టి వాడికే సంబంధం కుదురుతోందో చెప్పగూడదూ!" అంటూ అడ్డుతగిలాడు రామమూర్తి.

కొంచెమో గొప్పో చదువుకున్న రామమూర్తి సైతం జాతకాలపట్ల మితిమీరిన నమ్మకం కనబరుస్తున్నందుకు చిరాకు పడుతూ కృష్ణమూర్తి. "జాతకమంటే అదేమైనా మాయలమరాటీ వాడి భూతద్దమా అన్నయ్యా, దానిలో మనకు కావలసిన వాళ్ళు కనపడ్డానికీ" అన్నాడు.

"చూడగల నేర్పరితనముంటే జాతకం సరిగ్గా కూడా అలాంటిదే! మనవాడి కొక దూరపు సంబంధం కుదురుతుంది."

"దగ్గరి సంబంధా లేవీ లేవు గనుక అలా అనుకోవచ్చు" అంటూ కృష్ణమూర్తి దగ్గర చాపమీద పడుకున్న సరస్వతిని చూచి పళ్ళతో నాలుకను కొరుక్కున్నాడు.

రామమూర్తి మరొక ప్రశ్న వేశాడు. "సంబంధం ఏవైపు ఎంతదూరంలో కుదరొచ్చు నాన్నా" అని.

"అన్నయ్యా! అది జాతకం. రైల్వేగైడుకాదు."

"అదీ చూచాను. సంబంధం పడమర దిక్కునే కుదరాలి. దూరం సంగతి నిర్దుష్టంగా చెప్పలేము" అన్నారు. వెంకటాద్రిగారు కృష్ణమూర్తి ఛలోక్తిని లెక్కపెట్టకుండా.

"పడమటి దిక్కున పాల సముద్రం. పాలసముద్రంలో బంగారు దీవి. బంగారు దీవిలో చలువరాళ్ళ మేడ. మేడలో ఏడు మల్లెపూలతో తూగే చిన్నది ఉయ్యాలూగు తుంటోంది. దాన్ని తెచ్చి నీకొడుక్కు పెళ్ళిచేసుకో నాన్నా" అంది సరస్వతి లేచి చాపపైన కూచుంటూ.

"ఏమిటమ్మా సరస్వతీ! నీ ధోరణీ అర్థం కావడంలేదే!" అన్నారు వెంకటాద్రిగారు. ఆవులిస్తే ప్రేవులు లెక్క పెట్టగల వెంకటాద్రిగారు ఆ మాటలు తనకు అర్థం కాలేదంటే నమ్మడం కష్టం. సరస్వతికి ఈడొచ్చిన కుమార్తె వుందనీ, ఆ అమ్మాయిని తమ్ముని చేతికి పట్టివ్వాలనీ ఆమె ప్లాను వేసుకున్న విషయం వెంకటాద్రిగారి కెంతోకాలంనుంచీ తెలుసు. తెలిసీ, ఏమీ తెలియనినట్టు అమాయకత్వం వ్యక్తం చేస్తున్న తండ్రిని చూచి సరస్వతి ఒక క్షణంపాటు తన్ను తాను మరచిపోయి "నువ్వు నీ కొడుక్కు వేరే సంబంధమే చూచుకోవాలి నాన్నా! అంతటితో నీకూ మాకూ తెగిపోతుంది" అంది.

ఈ బ్రహ్మాస్త్రంతో అక్కడ నిమిషాలపాటు నిస్తబ్ధత తాండవించింది. సరస్వతే ప్రారంభించింది. "అవును మరి! నా కూతుర్నే పెళ్ళాడాలని నేను చెప్పడం లేదు. అక్కయ్య కూతురుందిగా హంసవేణి, దాన్ని చేసుకోనీ నాకభ్యంతరం లేదు పోనీ! సావిత్రి కూతురు నీరజను చేసుకోనీ, నాకిష్టమే!"

"హంసవేణికి ఆరేళ్ళు. నీరజకింకా ఏడాది పూర్తికాలేదు. అందుకే నీకింత తెంపు" అన్నాడు రామమూర్తి.

"తెంపో గింపో నాకు తెలియదు. మీ తోబుట్టువులంమేము ముగ్గురం వున్నాం. మాకొక్కరికి సరాసరి నలుగురు చొప్పున మొత్తం పన్నెండుమంది కూతుళ్ళున్నారు. ఇప్పుడిద్దరికి మాత్రం పెళ్ళిళ్ళయినాయి. ఇంకా పదిమంది వున్నారు. ఈ పదిమందికీ పంగనామాలు పెట్టి నువ్వు నీ తమ్ముడికి మాత్రం వేరే కొత్త సంబంధం చూస్తావా! చూచుకో అలాగైతే."

"తొందర పడుతున్నావమ్మా సరస్వతీ!" అంటూ మళ్ళీ సంభాషణలోకి దిగారు వెంకటాద్రిగారు. ఇది రెండు నిదానంగా ఆలోచించవలసి విషయం. మన యిళ్లల్లో మళ్లీ మేనమామ మేనకోడలిని పెళ్ళాడే ఆచారం లేదు."

"లేకేం! మరేం ఫరవాలేదు. మా చిన్నాన్న కొడుకు మేనకోడలిని పెళ్ళిచేసుకోలా!" "అంటూ చర్చలో ప్రవేశించింది, అంతరవకూ మౌనంగా కూచున్న లక్ష్మమ్మ.

"ఊహు! ఇదంతా నీ ఎత్తన్నమాట. చూచావా నాన్నా! కడకు తల్లీ కూతుళ్ళు ఒకటైపోయారు." అన్నాడు కృష్ణమూర్తి.

"తల్లి పలుకురా బాబూ తల్లి పలుకు! అది బల్లి పలుకుతో సమానం" అన్నారు వెంకటాద్రిగారు.

"ఇక్కడ నాదేముంది?! మాట మీరివ్వాలి. అదిపుచ్చుకోవాలి" అంది లక్ష్మమ్మ.

"అదేం రెల్వేస్టేషన్‌లో టికెట్టు తీసుకునేంత తేలికైన వ్యవహారమా! జాతకం చూడొద్దూ!" అన్నాడు కృష్ణమూర్తి గంభీరమైన పోజుపెట్టి.

"అవును చూడాలి" అన్నారు వెంకటాద్రిగారు.

"మీరిలా అంటారని తెలిసే జాతకం తెచ్చేశాను. రేపు ఉదయం దాన్ని చూచి మధ్యాహ్నంలోపల నాకేదో ఒకమాట చెప్పేయాలి."

వెంకటాద్రిగారు మళ్ళీ ఒకసారి తాంబూలం వేసుకుని నమలసాగేరు.

తెల్లవారింది. స్నానపానాలు, పూజా పునస్కారాలు నెరవేర్చి వెంకటాద్రిగారు కమలాంబ జాతకాన్ని ముందుంచుకుని చాపపైన కూచున్నారు.

అరచేతిలో ప్రాణాలు బిగపట్టుకుని అక్కా చెల్లెళ్ళు, తల్లితోసహా వెంకటాద్రిగారి ముఖాన్ని దీక్షగా చూడసాగారు.

సరిగ్గా పదకొండు గంటలకు వెంకటాద్రిగారు తల పైకెత్తి "అమ్మాయీ సరస్వతీ! నిజం చెప్పి నేను నిష్ఠూరపడడమెందుకు? మనం సిద్ధాంతిగారి దగ్గరికి వెళ్ళి జాతకాలు చూపిద్దాం. ఆయనదే ఆఖరు నిర్ణయ"మన్నారు.

సరస్వతి ముఖంలో కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు. అయినా ఆమె సంభాళించుకుని "అలాగే వెళ్దాం నాన్నా" అంది.

"ఆ విషయమలావుండనీ నాన్నా! మనం వాడి చదువుకోసం ఓపినన్ని అప్పులు చేసి పెట్టాం! ఆ అప్పుల సంగతేమిటి?" అన్నాడు రామమూర్తి.

"అంతమాత్రం కట్నం ముట్టకపోతే పెళ్ళి కుదురుతుందా" అని వెంకటాద్రిగారు నిర్ణయాన్ని వెలిబుచ్చారు.

"కట్నాలు కానుకలు మళ్ళీ చూచుకుందాంలే నాన్నా! మొదట జాతకాలు సరిపడనీ' అంది సరస్వతి.

ఆ సాయంత్రం పురాణ దంపతుల్లా లక్ష్మమ్మ వెంకటాద్రిగారూ సరస్వతిని తీసుకుని బస్సెక్కారు. బయల్దేరినవేళ మంచిది! సిద్ధాంతిగారు తీరిగా కనిపించారు.

సిద్ధాంతిగారికి అరవై డెబ్భైయేళ్ళు వుంటాయి. తరతరాలుగా వాళ్ళది జ్యోతిష్య శాస్త్రంలో అందెవేసిన కుటుంబం. సిద్ధాంతిగారొకప్పుడు స్వయంగా పంచాంగం గుణించి ముద్రించేవారు. సిద్ధాంతి పంచాంగమంటే దానికొక ప్రత్యేక గౌరవముండేది. ముఖ్యంగా వెంకటాద్రిగారికి సిద్ధాంతిగారి జ్యోతిష్యం పైన తన ప్రాణంపైనకంటే ఎక్కువ నమ్మకం ఏర్పడిపోయింది. ఆ ప్రాంతమంతటా జాతకాలపట్ల కలిగిన అభిప్రాయ భేదాలపైన సిద్ధాంతిగారి తీర్పు ప్రీవికౌన్సిల్ తీర్పులా చలామణి అవుతుంది.

సిద్ధాంతిగారు వధూవరుల జాతకాలు రెండింటినీ పరిశీలించిన మీదట పది పదిహేను నిమిషాలు తీవ్రంగా ఆలోచించి "ఈ జాతకాలు రెండు బాగానే వున్నాయి. కానీ ఒకదానికొకటి సరిపడడంలేదు." అన్నారు.

విజయగర్వంతో వెంకటాద్రిగారు కుమార్తెవైపు చూచారు.

సరస్వతి తలవంచుకుని మౌనంగా కూచుంది. ఆమె వున్నట్టుండి తల పైకెత్తి "ఏమండి! నే నొక మాటంటాను మీరు కోపగించుకోగూడదు" అంది.

"చెప్పమ్మా! కోపమెందుకు?" అన్నారు సిద్ధాంతిగారు.

లోకంలో ఎన్నో పెళ్ళిళ్ళు జరుగుతుంటాయి. నాకు తెలిసి మా ప్రక్కింటిలో ఒక పెళ్ళి జరిగింది. పెళ్ళికొడుకు తండ్రి మంచి పండితుడు. పెళ్ళికూతురు తండ్రి మంచి స్థితిమంతుడు. నూరంటే నోరునొచ్చును. అంతమందికి జాతకాలు చూపించారు. "అబ్బ! ఏం చక్కగా కుదిరాయని" ముక్కుమీద వేలు వేసుకున్నవాళ్లే అందరూ! కానీ ఏం లాభం! పెళ్ళయిన పదోనాటికల్లా బస్సు ప్రమాదంలో పెళ్ళికొడుకు కాలు పోయింది."

సిద్ధాంతిగారు ఒక క్షణం ఆలోచించి "పెళ్ళికొడుకు అదృష్టవంతుడు. అతడి భార్య జాతకంలో వైధవ్యం వ్రాసిపెట్టలేదు." అన్నారు.

సరస్వతి మళ్ళీ ప్రారంభించింది. "పోనివ్వండీ లోకంలో అందరూ మహారాజులే లేరు. బీదా బిక్కీ కూడా వున్నారు. వాళ్ళకు జాతకాలెవరు వ్రాసిపెట్టారు? పేర్లుకూడాలేని పెద్దబ్బాయికి, చిన్నమ్మికి పెళ్ళి జరుగుతుంది. వాళ్లు లక్షణంగా కాపురాలు చేయడంలేదా? వద్దు వద్దంటున్నా వాళ్ళకు బిడ్డలు పుట్టడంలేదా?"

ఒక పన్నుకూడాలేని బోసి నోటితో సిద్ధాంతిగారు నవ్వుతూ "ఎక్కడెక్కడైతే ఆలుమగళ్ళు చక్కగా కాపురం చేసుకుంటున్నారో అక్కడలా జాతకాలు ఒకదానికొకటి ద్వారబంధానికి తలుపు అమరినట్టు కుదిరిపోయివుంటాయని మనం అనుకోవాలమ్మా" అన్నారు.

"ఇప్పుడు మహమ్మదీయులున్నారు. సాధారణంగా వాళ్ళకు జాతకాలుండవు. పైగా వాళ్ళ పెళ్ళిళ్ళు సామాన్యంగా శుక్రవారం మంచి మధ్యాహ్నపు వేళలో జరుగుతాయి. శుక్రవారం మధ్యాహ్నం పదిన్నర నుంచి పన్నెండువరకూ రాహుకాలం వుంటుంది. ఆ రాహుకాలంలో జరిగిన పెళ్ళిళ్ళు ఏం చెడిపోయాయి?"

సిద్ధాంతిగారు సరస్వతి ముఖంకేసి చూస్తూ "ఇంతకూ నువ్వనేదేమిటమ్మాయ్" అన్నారు.

"జాతకాలు పెళ్ళిళ్ళకు ప్రతిబంధకాలు కాగూడదని" అంది సరస్వతి.

సిద్ధాంతిగారు మళ్ళీ నవ్వారు. నవ్వి "నిజమే! నేను అదే అనుకుంటున్నాను. నా మనవరాలి కొకదానికి పెళ్ళికావలసివచ్చింది. దాని జాతకంలో పెళ్ళయిన ఏడాదికే భర్తకు మరణయోగముంది. బలీయమైనయోగం. తప్పుతుందనడానికి అణుమాత్రమైనా వీల్లేదు. అలాగని దాన్ని పెళ్ళే లేకుండా వుంచేయాలంటే అదెలా పొసగుతుంది? కడకు పెళ్ళయింది. ఇప్పటికి పదేళ్ళు కావస్తున్నాయి. మొగుడు గుండ్రాయిలా వున్నాడు. దీన్నే మనాలి?" అన్నారు.

సరస్వతి ఇప్పుడేమంటారన్నట్టు తండ్రి వైపు చూచింది. తనకు ప్రాణప్రదమైన శాస్త్రం తన కళ్ళముందరే ఇంత పరాభవం పాలైనందుకు వెంకటాద్రిగారు నిలువునా కృంగిపోయారు.

జాతకాల పట్టింపు లిలా సమసిపోయిన తర్వాత మరునాడు ఇంటిదగ్గర కట్న కానుకలను గురించి చర్చలు ప్రారంభమైనాయి. కట్నం ప్రసక్తి వచ్చేసరికీ అంతవరకు వాదోడుగా వుండిన తల్లి సైతం సరస్వతి ప్రతిపక్షంలో చేరిపోయింది. అక్కాచెల్లెళ్ళు మొదటినుంచీ ముభావాన్నే చూపిస్తున్నారు. ఐతేనేం! సరస్వతి చర్చా రంగంలో అసహాయశూరత్వం ప్రదర్శించింది.

"వాణ్ణి చదివించారు. ఇప్పుడుద్యోగంకూడా దొరికింది. అందుచేత్త వాడినొక వస్తువులా వివాహాల సంతలో అమ్మజూస్తున్నారు. మీపాలిట కొక శనిలా నేనొకదాన్ని దాపురించాను. లేకుంటే మీకు మంచి లాభం వచ్చేది. అది పోయిందనేకదూ నీ కిప్పుడు చింత!" ఇలా వుపక్రమించింది సరస్వతి.

"అబ్బె ఇక్క డెవరూ లాభాలకోసం తాపత్రయపడడంలేదు. పెట్టుబడి గిట్టుబాటయితే చాలు. అది మాచేతవుండి ఖర్చయివుంటే ఇంత నొక్కి అడగవలసిన అవసరం వుండేదికాదు. బాకీ చేశాం. ఆ అప్పులైనా తీర్చాలిగదా!" అన్నాడు రామమూర్తి.

"అలాగే తీర్చుకుందురుగానీ మొదట నాకు ముహూర్తం పెట్టన్వండి" అంది సరస్వతి.

'ఏమంత తొందర' అని నసిగారు వెంకటాద్రిగారు.

"ముగ్గురు కూతుళ్ళకు పెళ్ళి చేశావు. ఈ తొందర నీకు మాత్రం తెలియనిదా నాన్నా! బిడ్డకు ఈడొచ్చి రెండేళ్ళు దాటిపోయాయి" అంది సరస్వతి.

◆ ◆ ◆

"నెల రోజుల్లో ముహూర్తం. పెళ్ళి మన ఇంటి దగ్గరే. కట్నం మూడు వేలు" అంటూ సరస్వతి ఒక్కసారిగా మూడుబాణాలు సంధించి భర్తపైకి వదిలింది.

ఏదో చెప్పబోయి రామారావు "ఉన్నట్టుండి మనకు మూడు వేల రూపాయల ఎక్కడినుంచి వస్తాయి సరూ?" అన్నాడు.

"పెళ్ళి ఖర్చులకు మాత్రం మీరు ఒక వెయ్యి రూపాయలు సరిపెట్టండి. కట్నం సంగతి నేను చూచుకుంటాను."

"ఏమిటి సరూ! నువ్వు చూచుకునేది! ఇది ఆషామాషీ వ్యవహారమా? నలుగురిలో నగుబాట్లపాలై పోవలసివస్తుంది."

"ఊరుకోండి అవ్వాకావాలి బువ్వాకావాలంటే ఎలా సాధ్యమౌతుంది? కూతురికి పెళ్ళి మాత్రం కావాలి. కాని కట్నం తేలేరు. తేలేకపోయిన తర్వాత నగుబాట్లు ఎలాగూ తప్పవు. అందుకు నేనేం చేయను?" "ఏదో మనకు తగిన సంబంధం...." భార్యవిసురుగా వెళ్ళిపోతుండడం చూచి వాక్యాన్ని మధ్యలోనే త్రుంచేశాడు రామారావు.

పెళ్ళిరోజు దగ్గరికి రానూ రామారావు ముఖం చింతాకంతయిపోయింది. బంధువు లొక్కొక్కరుగా రాసాగేరు. వచ్చినవాళ్ళందరూ "ఏం రామారావ్! ఈ మధ్య ఎపుడో కాయలాపడి లేచినట్టున్నావ్!" అని అతణ్ణి పరామర్శించారు. నిజానికి రామారావు అంత నీరసంగానే వున్నాడు. కూచుంటే లేవడానికి కూడా అతడికి మనస్కరించడంలేదు. తీరా పీటల పైకి వచ్చాక పెళ్ళి భగ్నమైపోతుందేమో! బంధువుల మధ్య తలవంపులు తప్పవేమో! స్త్రీ బుద్ధివల్ల ప్రళయం కలుగుతుందన్న దెందుకు....! రామారావు హృదయం తుఫానులో కంపించి పోసాగింది.

మగ పెళ్ళివారు వచ్చి విడిదిలో దిగినట్టు తెలియగానే రామారావు భార్య దగ్గరికి పరుగుతీసి "ఇప్పటికైనా మించిపోయింది లేదు. సరూ! నేనిప్పుడే మామగారితో అసలు విషయం చెప్పేస్తాను. అంత్య నిష్ఠూరంకన్నా ఆదినిష్ఠూరం మేలు. మళ్ళీ పెళ్ళిలో రచ్చలు రగడలు జరగడం బాగుండదు"అన్నాడు.

"మావాళ్ళప్పటికి రంపులు రగడలంటే లేచి నిలుచునేవాళ్ళనా మీ వుద్దేశం! ఊరుకోండి. ఎవరైనా వింటే నవ్విపోతారు." అంటూ సరస్వతి వంటిల్లువైపు వెళ్ళిపోయింది.

భార్య వేసుకున్న పథకమేమిటో అర్థంకాక రామారావు దిగులుతో గోడకానుకుని నిలుచుండిపోయాడు.

మగ పెళ్ళివాళ్ళు మేళ తాళాలతో ఇల్లు చేరుకునేసరికి రాత్రి పదకొండయింది. అప్పుడు భోజనాలైనాయి. ఆ తర్వాత నలుగులు, నాలుగ్గంటలకు ముహూర్తం, సాంగ్యాలన్నీ ఒకటి తప్పకుండా జరగడంతో వెంకటాద్రిగారు పట్టుదల చూపినందువల్ల మంగళ సూత్రధారణ జరిగేసరికి భళ్ళుమని తెల్లవారింది. వరుడు పురోహితుడి చేతినుంచీ మంగళ సూత్రం తీసుకుంటుండగా జనంలోనుంచీ ఎవరో "వరకట్నం అప్పుడే పుచ్చుకున్నారేమిటి?" అన్నారు. పెళ్ళికొడుకు తండ్రి ముఖం చూచాడు. వెంకటాద్రిగారు సరస్వతికేసి చూచారు. సరస్వతి పెళ్ళికమారుడి దగ్గరికి వచ్చి నవ్వుతూ "కట్నం కళ్ళబడందే బొట్టుమెడలో పడదట్రా తమ్ముడూ!" అంది.

"అబ్బే కట్నం సంగతి నాకు తెలియదక్కయ్యా! మీరు కట్టమంటే నేను సిద్ధంగా వున్నాను." అన్నాడు సుధాకరం.

"అయితే కానీ మరి" అంది సరస్వతి. పురోహితుడు "ముహూర్త మేళం" అని కేక వేశాడు. డోలు ఢణ ఢణా వాగిపోయింది. బంధువులు అక్షింతలు చల్లుతుండగా సుధాకరం కోమలాంబ మెడలో మూడుముళ్ళు వేసేశాడు.

ఉదయం అల్పాహారాలైన తర్వాత వెంకటాద్రిగారు పెద్ద కుమారుణ్ణి దగ్గరికి పిలిచి, "ఏదిరా డబ్బు?" అన్నారు.

"ఏమో నాకేం తెలుసు?" అని బిక్కరించాడు రామమూర్తి.

"వెళ్ళి అడగరాదూ మరి!" "నువ్వే అడుగు నాన్నా! ఆమెగా రెందుకో నాతో ముఖమిచ్చి మాట్లాడ్డం లేదు."

వెంకటాద్రిగారప్పటికి వూరుకున్నారు. సాయంత్రమైంది. బంధువులందరూ వధూవరులతో సహాగుడికి వెళ్ళారు. ఆ అవకాశాన్ని వినియోగించుకోదలచి వెంకటాద్రిగారు సరస్వతికి కబురు పెట్టాడు.

"ఏం నాన్నా!" అంటూ వచ్చింది సరస్వతి.

"మీ అన్నయ్య కట్న మెక్కడ నినన్నడగుతున్నాడు."

"కట్నం ఒక్కసారిగా ఎక్కడినుంచి తేగలం నాన్నా! మీకున్న అప్పులన్నీ మీ అల్లుడి పేర వ్రాయించేయండి మేము నెల కింత అని అంచల వారిగా అప్పులు తీర్చుకుంటాం. మా ఆస్తిపాస్తుల సంగతీ, మీ అల్లుడి సంపాదన సంగతీ మీకు తెలియందా నాన్నా!" అంటూ కంట తడిబెట్టింది సరస్వతి.

"అయినా నువ్వింత పని చేస్తావని నే ననుకోలేదు సరస్వతీ!" అన్నాడు రామమూర్తి.

"నువ్వూరుకో అన్నయ్యా! నీకూ ముగ్గురు ఆడబిడ్డలున్నారు. వాళ్ళకు పెళ్ళి చేయవలసి వచ్చినప్పుడు నీ బండారం బయటపడుతుంది." అంది సరస్వతి.

"నన్ను బియ్యేవరకూ చదివించాలి. బంగారు గొలుసుతో గడియారం వేయాలి. మోటర్ సైకిల్ కొనివ్వాలి. దుస్తులకు అయిదువందల రూపాయలివ్వాలి. అప్పుడుగానీ నేను పెళ్ళాడను" అన్నాడు సరస్వతి కొడుకు మామగారిని ఓరకంటితో చూస్తూ.

(...ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 23.01.1987)

❀ ❀ ❀